

చరిత్ర మరిచిన యోధుడు ఉయ్యాలవాడ

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి తిరుగుబాటుకు సంబంధించి బ్రిటీషు రికార్డులు ఎన్నో ఉన్నాయి. కానీ ఆయన సాగించిన తిరుగుబాటు చరిత్రపుటల్లో నమోదు కాలేదు. -8లో



దాల్మియా నిర్వాకంతో రైతులకు నష్టం

మైలవరం మండలంలోని దాల్మియా సిమెంట్ కర్మాగారం నిర్వాకంతో పరిసర గ్రామాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
33.8/21.8

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 21.8 – 33.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ఉన్న ఉపాధ్యాయ సంఘాలతో ఈనెల 22వ తేదీ డీఈఓ కార్యాలయంలో సమన్వయ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు డీఈఓ డాక్టర్ షేక్ షంషుద్దీన్ తెలిపారు. శనివారం సాయంత్రం 5 గంటలకు విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి జిల్లాలో ఉన్న ప్రతి ఉపాధ్యాయ సంఘం నుంచి జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి తప్పకుండా హాజరుకావాలని కోరారు.

24న గండిలో టెండర్లు



చక్రాయపేట: జిల్లాలోని గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో ఈనెల 24న తలనీలాలు,ఒక భాగం కొబ్బరి చిప్పలు సేకరించే హక్కు కల్పించడానికి ఇ-టెండర్, షీల్డ్ టెండర్, బహిరంగ వేలంపాటను 3వ పర్యాయం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య శుక్రవారం తెలిపారు. గతం లో రెండు మార్లు టెండర్లు నిర్వహించినా సరైన ధర రానందున టెండర్లు రద్దు చేశామన్నారు. సోమవారం జరిగే టెండర్లలో పాల్గొనే వారు తలనీలాలకు రు.25లక్షలు,కొబ్బరి చిప్పలకు రు.3లక్షలు డిపాజిట్ చెల్లించాలని తెలిపారు.పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

రైతు బజార్‌లో టమాటా విక్రయాలకు అనుమతి

కడప అగ్రికల్చర్: జిల్లాలో టమాటా రైతులకు పంట ఉండి ఎటువంటి గుర్తింపు కార్డు లేకపోయినా రైతు బజార్‌లో సరుకులు అమ్మకాలు చేయడానికి ప్రభుత్వం అనుమతి కల్పించిందని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. కూరగాయల పంట సీజన్ అయినందున ఎక్కవ సంఖ్యలో సరుకు దిగుబడి రావడంతో గ్రామాల్లో తగినంత ధర రాకపోవడం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అయితే వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ వారు రైతులు తమ సరుకును నేరుగా తీసుకుని తమ పరిధిలోని రైతు బజార్లలో అమ్మకునేందుకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఈ విషయలో సందేహాలు ఉంటే జిల్లా సహాయ కేంద్రం 87126 44814,08562-246344, రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ 8074723702 నంబర్లలో సంప్రదించాలని జేసీ తెలిపారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

లక్కిరెడ్డిపల్లి: అనంతపురం గంగమ్మ ఆల యంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య ఆధ్వర్యంలో శుక్రవారం హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. రూ. 4,29, 680 వచ్చినట్లు ఆలయ ప్రత్యేకాధికారి శ్రీనివాసులు తెలిపారు. ఈ నగదును ఆలయ ఖాతాకు జమచేస్తామని, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పూజారులు చెల్లు గంగరాజు, దినేష్ కుమార్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మార్చి 6న 'చలో విజయవాడ'


కడప వైఎస్‌ఆర్ సర్కిల్: మున్సిపల్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మార్చి 6న తల పెట్టిన చలో విజయవాడను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కెసీ బాదుల్లా పేర్కొన్నారు. శుక్రవారం కడపలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దుపరిస్తే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని మళ్లీ ప్రైవేటు బడా కంపెనీలకు,ఏజెన్సీలకు అప్పచెబుదామన్న మంత్రివర్గ సభ్యుల అభిప్రాయాలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు జరగనున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి మున్సిపల్ కార్మికుల సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించుకోవడానికి పోరాటానికి కార్మికుల సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. పర్మినెంట్ కార్మికులకు మూడు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న సరెండర్ లీవ్ లో ఎన్‌క్యాస్‌మెంట్, మూడు డీఏలు సత్వరం విడుదల చేయాలన్నారు. ఈ నెల 24న కడప నగరపాలక సంస్థ కార్యాలయం, మార్చి 3న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన, ధర్నాలు చేపడతామన్నారు. మార్చి 6న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఈశ్వరయ్య, జాన్, వెంకటాద్రి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యం.. పచ్చ గ్రహణం

- 1962 అంబులెన్స్‌లపై కూటమి కక్ష
- జిల్లాలో మొదటి విడత మొబైల్ అంబులెన్స్ సేవలు నిలిపివేత
- కూటమి ప్రభుత్వం తీరుపై పాడి రైతుల ఆగ్రహం



కడప జేడీ కార్యాలయంలో ఉంచిన మొబైల్ అంబులెన్స్



కడప అగ్రికల్చర్: అత్యవసర సేవలపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగింది. దీంతో జిల్లాలో 1962 హెల్ప్‌లైన్ మూగబోనుంది. మారుమూల గ్రామాల్లోని పశు వైద్యానికి గ్రహణం పట్టనుంది. పశువులకు సైతం అత్యవసర వైద్యం అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సంచార వైద్య సేవలకు మంగళం పాడింది, ఉన్నఫళంగా ఆరోగ్య సేవలు నిలిపేసి ఉద్యోగులను వెళ్లిపోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా మొదటి విడుదతలో వచ్చిన నియోజక వర్గానికి ఒకటి చొప్పున వచ్చిన 7 సంచార పశు వైద్య వాహనాలు ఆగిపోయాయి. ఫేజ్-1లో వాహనాలు తిరిగి ఆయా పశు వైద్యశాఖ ఏడీ కార్యాలయాల్లో అప్పగించి తమకు రిపోర్టు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో వాటిలో పనిచేసే పైలట్, డాక్టర్లను విధులకు హాజరుకావద్దని వాట్సాప్ మేసేజ్ ద్వారా సూచించారు.

- ప్రస్తుతం మొదటి విడతకు సంబంధించిన ఏడు సంచార పశు వైద్య అంబులెన్స్‌లను ఆపేశారు. ఇందులో కడప, కమలాపురం, జమ్మలమడుగు నియోజక వర్గాలకు సంబంధించిన వాహనాలను ఆయా ఏడీ కార్యాలయాలు స్వాధీనం చేసుకున్నాయి. ఇంకా బద్వేల్, పులివెందుల, పొద్దుటూరు, మైదుకూరు నియోజక వర్గాలకు చెందిన వాహనాలను స్వాధీనం చేసుకోనున్నారు. త్వరలో రెండో విడతకు సంబంధించి మరో 6 సంచార పశు వైద్యవాహనాల సేవలను కూడా ఆపేయనున్నట్లు తెలిసింది. ఇవి కూడా ఆగిపోతే గ్రామాల్లో సంచార పశు వైద్య సేవలు అగిపోనున్నాయి. దీంతో మూగ జీవాలు, పశు పోషకులు ఆందోళన చెందుతున్నాయి.

▶▶ వైఎస్ జగన్ హయాంలో మెరుగైన వైద్య సేవలు

పశుపోషకుల ఇంటి ముంగిటే మూగజీవాలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవలను అందుబాటులోకి తెచ్చింది. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బృహత్తర కార్యక్రమానికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారు. అసెంబ్లీ నియోజక వర్గానికి రెండు చొప్పున అంబులెన్సులను మంజూరు చేశారు. ఇందులో భాగంగా వైఎస్సార్‌జిల్లాకు 2022 మే నెలలో మొదటి విడతతో 7 సంచార పశువుల అంబులెన్స్‌ను, 2023 ఏప్రిల్ నెలలో మరో ఆరింటిని మంజూరు చేశారు. వీటి ద్వారా సేవలు పొందేందుకు ప్రత్యేకంగా 1962 అనే టోల్ ఫ్రీ నంబర్ సైతం ఏర్పాటు చేసి సేవలను ప్రారంభించారు.

ఫోన్ చేస్తే చాలు..

ప్రభుత్వం ఏర్పాటు చేసిన పశు సంచార అంబులెన్స్‌కు సంబంధించిన 1962 టో ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి పశువు ఆరోగ్య సమస్యను వివరిస్తే చాలు నిమిషాల వ్యవధిలో అంబులెన్స్ రైతు ముంగిటకు వచ్చేది. మెరుగైన వైద్య సేవలు అందించాల్సి వస్తే సమీపంలోని ఏరియా పశు వైద్యశాల, వెటర్నీరీ పాలీక్లినిక్‌కు తరలించి చికిత్స అందించి తిరిగి ఆ పశువును సురక్షితంగా రైతు ఇంటికి చేర్చేవారు. సేవలు ప్రారంభించిన మూడేళ్లలో వేల సంఖ్యలో పశువులకు వైద్య సేవలందించి అందరి మన్ననలు పొందారు. అంతటి ప్రాధాన్యం సంతరించుకున్న వాహనాలను కూటమి ప్రభుత్వం ఉన్నఫళంగా ఆపేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు..



ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మొదటి విడతలో భాగంగా కడప, కమలాపురం, జమ్మలమడుగు నియోజక వర్గాలకు సంబంధించిన వాహనాలను స్వాధీనం చేసుకున్నాం. మిగతా నాలుగింటిని కూడా త్వరలో స్వాధీనం చేసుకుంటాం.

– డాక్టర్ శారదమ్మ, జాయింట్ డైరెక్టర్, జిల్లా పశుసంవర్ధకశాఖ

» ఆందోళనలో ఉద్యోగులు

సంచార పశువైద్య వాహనాల్లో పనిచేసే పైలట్, పారావిరట్, డాక్టర్, ఇలా మొత్తం 21 మంది పనిచేస్తున్నారు. వీరందరిని వెళ్లమని చెప్పడంతో వారి కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. ఉద్యోగాలు తిరిగి ఇస్తారా..ఇంతటితో ఆగిపోవాలా అన్న స్పష్టత లేకపోవడంతో ఉద్యోగల భవిషత్తు ప్రశ్నార్థకంగా మారింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2022 మే 19న జిల్లాలో మొదటి విడత అంబులెన్స్ సేవలను ప్రారంభించింది. అప్పట్లో నియోజక వర్గానికి ఒక వాహనం చొప్పున కేటాయించారు. ప్రతి వాహనంలో వాహనాన్ని నడిపే పైలట్, పారావిట్, డాక్టర్ పనిచేసే వారు. వారంతా దాదాపు మూడేళ్ల దాకా పనిచేశారు. ఇప్పుడు ఉన్నట్లుండి రాత్రికి రాత్రే వారి సేవలు అపేయడంతో వారు అందోళన చెందుతున్నారు. ఉద్యోగాలు తొలగించడంతో రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితుల్లో ఉన్న తమ కుటుంబాలు వీధిన పడ్డాయని వాపోతున్నారు. వేతనాలు పెరుగుతాయని భావిస్తే.. తమకు చేదు అనుభవం ఎదురైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగంలో కొనసాగించాలని వినతి

వైఎస్సార్‌జిల్లా పశు సంవర్ధకశాఖలో గత మూడు సంవత్సరాలుగా 42 మంది పశు సంచార వైద్య వాహనాల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా ఈఎంఆర్‌ఐ ఏజెన్సీ ద్వారా పనిచేస్తున్నామని, తమను ఉద్యోగంలో కొనసాగించాలని మెబైల్ అంబులెన్స్ సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై వారు జిల్లా పశు సంవర్ధకశాఖ జేడీ శారదమ్మకు వినతిపత్రాన్ని సమర్పించారు.



జేడీకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న సిబ్బంది

సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎస్పీ



వినతులను స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్

కడప అర్బన్: పోలీసు సిబ్బంది, సమస్యల పరిష్కారం కోసం జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు 'గ్రీవెన్స్‌డే' నిర్వహించారు. జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌లు, ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది బదిలీలు, వ్యక్తిగత, స్పౌస్, చిల్డ్రన్స్ మెడికల్ సమస్యల గురించి స్వయంగా విన్నవించుకున్నారు. జిల్లా ఎస్పీ సిబ్బంది సమస్యలను విని తగిన పరిష్కారం చూపుతామని వారికి భరోసా కల్పించారు. సిబ్బంది ఫిర్యాదులను పరిశీలించి సత్వరం పరిష్కరించాలని సంబంధిత జిల్లా పోలీసు కార్యాలయ అధికారులను ఆదేశించారు.

పోలీసు జాగిలం పదవీ విరమణ



పదవీ విరమణ పొందిన జాగిలం మ్యాగిని సన్మానిస్తున్న అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి: అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో మ్యాగి అనే పోలీసు జాగిలం శుక్రవారం పదవీ విరమణ పొందింది. మ్యాగి 11 సంవత్సరాలు పాటు విశిష్ట సేవలందించి పలు కీలక విధులను సమర్థవంతంగా నిర్వహించడం పట్ల జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు అభినందించారు. హత్యలు, రేప్‌లు, దొంగతనం చేసిన వారిని గుర్తించడంలో నేర్పరిగా పేరున్న జర్మన్ షపర్డ్ జాతికి చెందిన జాగిలం మ్యాగిని జిల్లా ఎస్పీ ఘనంగా సన్మానించారు.

మహాశివరాత్రికి 317 ప్రత్యేక బస్సులు



కడప కోటిరెడ్డిసర్కిల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని కడప రీజియన్ వ్యాప్తంగా వివిధ శైవ క్షేత్రాలకు 317 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆర్‌ఎం కార్యాలయంలో డిప్యూటీ సీఎంఈ, డిపో మేనేజర్లు, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, మెకానికల్ సూపర్‌వైజర్లతో మహాశివ రాత్రి ఉత్సవాలకు చేయాల్సిన ఏర్పాట్లు గురించి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ పొలతలకు 78 బస్సులు, నిత్యపూజకోన 40, శ్రీశైలం 2, రాయచోటి నుంచి పొలతలకు 40, పులివెందుల నుంచి పొలతలకు 27, భానుకోటకు 3, బద్వేలు నుంచి లంకమలకు 25, బి.మఠానికి 5, మల్లెంకొండకు 12, పోరుమామిళ్ల నుంచి ఎస్ఎస్ మఠానికి 3, మైదుకూరు నుంచి లంకమలకు 15, జ్యోతి (సావిశెట్టిపల్లె)కి 2, పోరుమామిళ్ల జ్యోతికి 6, బి.మఠానికి 15, ప్రొద్దుటూరు నుంచి పొలతలకు 15, ఎర్రగుంట్ల సంగమేశ్వర దేవళాలు 4, అల్లాడుపల్లె దేవళాలు 10, కన్యతీర్థం 6, జమ్మలమడుగు నుంచి అగస్త్యశ్వరకోనకు 5, కన్యతీర్థంకు 2, శ్రీశైలానికి 2 బస్సులు చొప్పున మొత్తం 317 బస్సులను నడపనున్నామన్నారు. చుట్టుప్రక్కల ప్రాంతాల ప్రజలు, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలు ప్రైవేటు వాహనాల్లో కాకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

గంగమ్మ జాతరకు ప్రత్యేక బస్సులు

మార్చి 1న లక్కిరెడ్డిపల్లె మండలంలోని గంగమ్మ జాతరకు కడప నుంచి 25 బస్సులు, పులివెందుల నుంచి 25 బస్సులు నడుపుతున్నామన్నారు. అలాగే మార్చి 14న పౌర్ణమి నాడు తిరుమన్నామలై అరణాచల గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల, మైదుకూరు డిపోల నుంచి బస్సులు బయలుదేరుతాయని ఆర్‌ఎం తెలిపారు.

ప్రతి సోమవారం నిత్యపూజకోనకు రెగ్యులర్ సర్వీసు

కడప కోటిరెడ్డిసర్కిల్: కిలోమీటరుకు రూ.1.88 ప్రకారంగా నిత్యపూజకోనకు రూ. 90 టిక్కెట్ ధరగా నిర్ణయించామని కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం కడప డిపోనుంచి నిత్యపూజకోనకు రెగ్యులర్ సర్వీసులు నడపనున్నామన్నారు. ఇప్పటికే దేవదాయశాఖ అధికారులతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. ఈ మహాశివరాత్రికి స్పెషల్ బస్సుల్లో ఎటువంటి ఆర్టీసీ పాసులు, ఆధార్‌కార్డు డిస్కౌంట్లు చెల్లుబాటు కావన్నారు. మహా శివరాత్రి సందరగా కడప-నిత్యపూజకోనకు రెండు స్టేజీలను ఏర్పాటు చేశామన్నారు. భాకరాపేట, సిద్దవటం లలో స్టాపింగ్ ఉంటుందన్నారు. భాకరాపేట నుంచి నిత్యపూజకోనకురూ. 60, సిద్దవటం నుంచి రూ.40ఛార్జి ఉంటుందన్నారు. కార్యక్రమంలో తాళపత్ర గ్రంథ లిపి నిపుణులు నాగదాసరి మునికుమార్, ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కన్యాకుమారి, సూపర్‌వైజర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తా

- ఎమ్మెల్యే డాక్టర్ సుధ
- మున్సిపల్ కమిషనర్ తీరుపై ఎమ్మెల్యే సీరియస్
- కనీస మర్యాద ఇవ్వడం లేదంటూ కౌన్సిలర్లు సైతం ఆగ్రహం



వైస్ చైర్మన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్ నరసింహారెడ్డి

బద్వేలు అర్బన్: ప్రజాప్రతినిధులకు కనీస మర్యాద ఇవ్వకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ సుధ మున్సిపల్ అధికారులను హెచ్చరించారు. స్థానిక ఎన్‌జీవో కాలనీలోని మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళరాజగోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి ఆయా వార్డుల్లో పర్యటనకు వెళుతున్నప్పుడు సంబంధిత వార్డు కౌన్సిలర్లకు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా వారిని అవమానపరుస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. అధికార పార్టీ కౌన్సిలర్లు ఉన్న వార్డుల్లో ఒకలా, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఉన్న వార్డుల్లో మరోలా వ్యవహరించడం సరికాదన్నారు. సమావేశ అజెండాలో తనకు, ఎమ్మెల్సీకి ఆహ్వానం పంపినట్లు పొందుపరచకపోవడం సరికాదని అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం



అజెండా ప్రతులను చూపుతూ కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

వ్యక్తం చేశారు. అంతేకాకుండా గత సమావేశాల్లో సభ్యులు ఏ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు, వాటిని ఏ మేరకు పరిష్కరించారు అనే దానిపై తప్పనిసరిగా సమీక్ష జరగాలని సూచించారు. అధికారులు రాజకీయాలతో సంబంధం లేకుండా వ్యవహరించాలని కోరారు.మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ భావనారాయణనగర్‌లో వంక పోరంబోకులో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని గతంలో ఫిర్యాదు చేసినా ఇంత వరకు ఎందుకు పట్టించుకోలేదని మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. అలాగే ఆహ్వానం ఉండి సమావేశానికి హాజరు కాని అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని కమిషనర్‌కు సూచించారు. ముఖ్యంగా కొన్ని వార్డుల్లో సచివాలయ సిబ్బంది ఏవైనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంబంధిత వార్డు కౌన్సిలర్లకు కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదని, ఇటువంటి పద్ధతులు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

▶▶ కౌన్సిలర్ల ఆగ్రహం

తమకు మున్సిపల్ కమిషనర్ కనీస మర్యాద ఇవ్వడం లేదంటూ కమిషనర్ తీరుపై కౌన్సిలర్లు సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా వార్డుల్లో పర్యటించే సమయంలో, వార్డుల్లో ఏవైనా పనులు చేపట్టే విషయంలో తమకు సంబంధం లేకుండానే నిర్ణయాలు తీసుకుంటున్నారని వాపోయారు. ఇదే అధికారపార్టీకి చెందిన వార్డుల్లో, మరికొన్ని వార్డుల్లో ఆ పార్టీకి చెందిన కౌన్సిలర్లను, నాయకులను తీసుకెళ్లడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. తనపై కక్ష పూరితంగా నాలా యాక్ట్ పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. బద్వేలు పట్టణంలో ఇప్పటి వరకు ఎంత మంది నాలా యాక్ట్ నిబంధనలు పాటించారో సమాధానం చెప్పాలని వైస్ చైర్మన్ గోపాలస్వామి పట్టుబట్టారు. అజెండాకు సంబంధం లేని విషయాలపై సమావేశంలో చర్చించనని కమిషనర్ తెలపడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులను పిలిచి బయటికి పంపిస్తానని కమిషనర్ సమావేశ హాలులోకి పోలీసులను పిలిపించడంతో మిగిలిన వైఎస్సార్‌సీపీ సభ్యులు కమిషనర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మేమేమైనా రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముకుంటున్నామా, పోలీసులను పిలిచి వైస్ చైర్మన్‌ను బయటికి పంపించాలని చూస్తే మేము కూడా బయటికి వెళ్లిపోతామని మూకుమ్మడిగా లేచి నిలబడటంతో చేసేదేమీ లేక కమిషనర్ మిన్నకుండిపోయారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్లకు సంబంధించి చాలా మంది లబ్ధిదారులు రూ.25 వేల ప్రకారం డబ్బు చెల్లించారని, వారికి న్యాయం చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ సమావేశం దృష్టికి తీసుకురాగా దీనిపై సంబంధిత శాఖ అధికారులకు లేఖ రాశామని, వీలైనంత త్వరగా లబ్ధిదారులకు డబ్బు జమ అయ్యేలా చూస్తామని కమిషనర్ సమాధానమిచ్చారు. అలాగే తమకు 25 ఏళ్లుగా జీవనాధారంగా ఉన్న దుకాణాన్ని అధికార పార్టీ నాయకుల మాటలు విని తొలగించారని 27వ వార్డు కౌన్సిలర్ శీలిరమాదేవి కమిషనర్‌ను ప్రశ్నించారు. ఇదే విషయమై కొందరు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు కమిషనర్‌ను నిలదీశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తొలగించామని కమిషనర్ సమాధానమివ్వగా ... పట్టణంలో రోడ్డు పక్కన ఉన్న ఎన్ని దుకాణాలను తొలగించారని ప్రశ్నించారు. వాటికి కూడా కమిషనర్ ఆదేశాలు తీసుకువస్తే తొలగిస్తామని సమాధానమిస్తూ తప్పించుకునే ప్రయత్నం చేశారు. 22వ వార్డు పరిధిలోని ఎన్‌జీవో కాలనీలో విద్యుత్ స్తంభాలు రోడ్డు మధ్యలోనే ఉన్నాయని గతంలో అనేకసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వార్డు కౌన్సిలర్ ప్రఫుల్లారెడ్డి సమావేశం దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. అనంతరం పోలీసుల రంగ ప్రవేశంతో అజెండాపై చర్చించి సమావేశాన్ని ముగించారు. సమావేశంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతుల గోడు వినిపించుకోండి

- చంద్రబాబు, కరువు కవలపిల్లలు
- వ్యవసాయంపై సీఎం, మంత్రులు సమీక్ష చేయకపోవడం దారుణం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: రాష్ట్రంలో రైతుల గోడు కూటమి ప్రభుత్వం వినిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడపలోని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా కరువును వెంట తీసుకుని వస్తారని, కరువు, ఆయన కవలపిల్లలని ఎద్దేవా చేశారు.ఆయన పాలనలో సకాలంలో పంటలు పండవని, మద్దతు ధర లభించక రైతులు అనేక ఇబ్బందులు పడతారన్నారు. ఈసారి కూడా అదే పరిస్థితి ఏర్పడినందున బాబు రికార్డ్ బ్రేక్ చేశారన్నారు. మేనిఫెస్టోలో రైతులకు పెట్టుబడి నిధి కింద ఎకరాకు రూ.20వేలు ఇస్తామని చెప్పి అమలు చేయలేదన్నారు. ఈ క్రాపింగ్ విధానం, ఆర్‌బీకేలను నిర్వీర్యం చేశారన్నారు. ఆర్‌బీకేల వ్యవస్థను ప్రపంచ దేశాలు, మిగతా రాష్ట్రాలు మెచ్చుకుంటుంటే ఈ రాష్ట్రంలో మాత్రం రేషనలైజేషన్ పేరుతో ఆర్‌బీకేలను, ఉద్యోగుల సంఖ్యను కుదిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అనేక లాభాలు కలిగేవన్నారు. టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేస్తే సైంటిస్టులు సలహాలు, సూచనలు ఇచ్చేవారన్నారు. రైతులకు సున్నావడ్డీకే రుణాలు లభించేవన్నారు. గతంలో వీఎస్‌పల్లెలో ఉల్లి పంటకు నష్టం వస్తే 21 రోజుల్లోనే పంట నష్ట పరిహారం అందించారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం కొన్ని పంటలకు మాత్రమే మద్దతు ధర ప్రకటిస్తుందని, మద్దతు ధర ప్రకటించని పసుపు, మిర్చి, అరటి వంటి 24 రకాల పంటలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మద్దతు ధర ప్రకటించారన్నారు. రైతుల పండించిన పంటలో ప్రభుత్వం 50 శాతం కొంటే, మిగిలిన పంటను వారు ఎలాగైనా అమ్ముకుంటారన్నారు. జగన్ ప్రభుత్వంలో రాష్ట్రంలో 147 ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు ఉండేవని, భూసార పరీక్షలు, నీటి పరీక్షలు వంటివి అందులో చేసేవారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేట్‌పరం చేస్తోందని విమర్శించారు. రోమ్ నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించినట్లు...రాష్ట్రంలో రైతులు ఇబ్బందులు పడుతుంటే చంద్రబాబు కుంభకర్ణుడిలా నిద్రపోతున్నారని ఎద్దేవా చేశారు. వ్యవసాయంపై చంద్రబాబుగానీ, మంత్రులుగానీ చిన్న సమీక్ష కూడా చేయలేదని ధ్వజమెత్తారు. మిర్చి పంటకు సంబంధించి 25 శాతం పంటను రూ.3528కోట్లు ఖర్చుచేసి కొంటే రైతులకు ఉపయోగమని అధికారులు లెక్కలు వేస్తే ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. మిర్చి రైతుల సమస్యలను తెలుసుకునేందుకు ప్రతిపక్షనేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు మిర్చి యార్డుకు వెళితే....అప్పుడు ఆదరా బాదరాగా కేంద్రానికి లేఖ రాసి చేతులు దులుపుకున్నారన్నారు. మిర్చిని గతంలో ఎప్పుడూ నాఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన పరిస్థితి లేదన్నారు. అయినా చంద్రబాబు నాఫెడ్‌కు లెటర్ రాయడం విచిత్రంగా ఉందన్నారు. మిర్చి రైతులను ఆదుకోవాలని వైఎస్ జగన్ చెబితే, మంత్రులు వ్యక్తిగత విమర్శలు చేయడం దారుణమన్నారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో క్వింటాల్ మిర్చి ధర రూ.20వేలకు పైగా ఉండేదని, ఇప్పుడు రూ.6వేలు కూడా అమ్ముడుపోవడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.1.30లక్షల కోట్లు అప్పులు చేశారని, కానీ ఆ నిధులను ఎక్కడ వినియోగించారో చెప్పలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పులు చేసినా దానిని సంక్షేమానికి వినియోగించారన్నారు. మిర్చి యార్డుకు వెళ్లినందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కేసు పెట్టడం దారుణమన్నారు. అందులో పాల్గొనని వారిపై కూడా కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. తమకు కేసులు కొత్త కాదని, ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని, ప్రజల తరఫున పోరాడేందుకు వైఎస్ఆర్సీపీ సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్ కుమార్, నాగేంద్రా రెడ్డి, షఫీ, శ్రీరంజన్ రెడ్డి, హరిచందన్, ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారు ఢీకొన్న వ్యక్తి చికిత్స పొందుతూ మృతి


మృతుడు ఎర్రమరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని జాతీయ రహదారిపై గురువారం ఉటుకూరు సర్కిల్ సమీపంలో బైకును వెనుక నుంచి ఫార్చునర్ కారు ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన ఎర్రమరెడ్డి వెంకటేశ్వరరెడ్డి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్ నాయక్ తెలిపారు. వివరాలిలా.. మృతుడు ఎర్రమరెడ్డి వెంకటేశ్వరరెడ్డి ఈనెల 20వ తేదీన సాయంత్రం ఉటుకూరు వద్ద వున్న గోపాల్ పొల్యూషన్ షాపు వద్ద తన మోటార్ సైకిల్‌పై వెళుతుండగా కడప వైపు నుంచి వస్తున్న ఫార్చునర్ కారు మోటార్ సైకిల్‌ను ఢీ కొంది. ప్రమాదంలో వెంకటేశ్వరరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కడప రిమ్స్‌కు తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స కొరకు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

13 మంది జూదరుల అరెస్టు

– రూ.3.45లక్షల నగదు స్వాధీనం

పులివెందుల రూరల్ : నియోజకవర్గంలోని తొండూరు మండలం మల్లేల అటవీ ప్రాంతంలో గురువారం రాత్రి 13మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.3.45లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పులివెందుల రూరల్ సీఐ వెంకటరమణ తెలిపారు. శుక్రవారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో రూరల్ సీఐ మాట్లాడుతూ నియోజకవర్గం మండలాల్లో జూదమాడుతున్నట్లు సమాచారం రావడంతో మొదటిసారిగా తొండూరు మండలం మల్లేల గ్రామంలో అటవీ ప్రాంతంలో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో ఓం ప్రకాష్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డిలతోపాటు మరో 11 మందిని అరెస్ట్ చేశామన్నారు. నియోజకవర్గ మండలంలో ఎక్కడైనా జూదమాడాతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారమందించాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


సుమంత్ మృతదేహం

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని రింగురోడ్డు పైన జయరాజ్ గార్డెన్స్ వద్ద జరిగిన రోడ్డ ప్రమాదంలో కొండపల్లి సుమంత్ మృతి చెందినట్లు చింతకొమ్మదిన్నె సీఐ శివ శంకరనాయక్ తెలిపారు. వివరాలిలా.. మతుడు నంద్యాల టౌన్, పొన్నాపురం నివాసి. అతని స్నేహితులు శివ, సురేంద్ర లతో కలసి ముగ్గురు బుల్లెట్ వాహనంపై శుక్రవారం తెల్లవారుజామున తిరుమలకు దైవ దర్శనానికి బయలుదేరారు. చింతకొమ్మదిన్నె పరిధిలోని రింగరోడ్డులో జయరాజ్ గార్డెన్స్ వద్ద స్పీడ్ బ్రేకర్ కనిపించక వేగంగా వెళ్లడంతో వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. గాయపడిన సుమంత్, శివను చికిత్స కోసం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. అప్పటికే సుమంత్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరికి గాయాలు

వల్లూరు : మండల పరిధిలోని గోటూరు సమీపంలోని వంతెన వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు అందించిన వివరాల మేరకు చెన్నై నుంచి ముంబైకి స్క్రాప్ లోడుతో వస్తున్న కంటెయినర్ లారీ గోటూరు సమీపంలోని వంతెన వద్ద అదుపు తప్పి వంకలోకి దూసుకెళ్లింది. దీంతో మహారాష్ట్రకు చెందిన డ్రైవర్ శివానంద్ లోనీ, క్లీనర్ సంతోష్ గాయపడ్డారు. దీంతో 108 వాహనంలో వారిని కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

చరిత్ర విస్మరించిన యోధుడు ఉయ్యాలవాడ

నేడు 178వ వర్ధంతి సభ

కడప సెవెన్‌రోడ్స్ : నేటికి సరిగ్గా 178 సంవత్సరాల క్రితం నాటి కడప జిల్లా తాలూకా కేంద్రమైన కోవెలకుంట్లలో ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రభుత్వం ఉయ్యాలవాడ నరసింహారెడ్డిని ఉరి తీసింది. కడప కలెక్టర్ జేహెచ్ కాక్రేన్ ప్రత్యక్ష పర్యవేక్షణలో రెండు వేల పైబడి జనం చూస్తుండగా బహిరంగంగా ఈ దారుణానికి పాల్పడ్డారు. తమను ఎదిరించే ఎవరికైనా ఇదే గతి పడుతుందని ప్రజలను హెచ్చరిస్తూ 30 ఏళ్లపాటు ఆయన తలను అలాగే ఉంచారు. మూడు నెలలపాటు తమను ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాపించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి తిరుగుబాటును ఎట్టకేలకు అణిచి వేశామని బ్రిటీషర్లు సంబరాలు చేసుకున్నారు. కానీ పదేళ్ల తర్వాత అది ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంగా రూపుదాలుస్తుందని, సరిగ్గా వందేళ్లకు తాము ఈ దేశాన్నే వదిలిపెట్టి పారిపోవాల్సి వస్తుందని ఊహించలేకపోయారు.



కోవెలకుంట్లలో ఉయ్యాలవాడ విగ్రహం, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పట్టుబడిన జగన్నాథకొండ

చరిత్రకారుల చిన్నచూపు

నరసింహారెడ్డి తిరుగుబాటుకు సంబంధించిన బ్రిటీషు రికార్డులు ఎన్నో ఉన్నాయి. జానపదుల కోలాటపు పాటలు, పిచ్చిగుంట్ల వారు ఆలపించే పాటలు, ఇతర జానపద సారస్వతం తక్కువేమి లేదు. కానీ, ఆంధ్ర చరిత్రకారులకు ఇవి పట్టినట్లు లేదు. ఈ తిరుగుబాటు పట్ల చులకన ధోరణి ప్రదర్శించారు. పెదనందిపాడు పన్నుల నిరాకరణ ఉద్యమం, చీరాల–పేరాల ఉద్యమం వంటివి చరిత్ర పుస్తకాలకెక్కాయి. కానీ నరసింహారెడ్డి సాగించిన వీరోచిత తిరుగుబాటు చరిత్రపుటల్లో చోటు చేసుకోకపోవడం బాధాకరం. ఇది రాయలసీమపై జరుగుతున్న వివక్షలో భాగమేనని ఇక్కడి మేధావులు అంటున్నారు. ప్రముఖ బెంగాలీ చరిత్రకారుడు ఎస్‌బీ చౌదురి 1955లో రాసిన 'సివిల్ డిస్టర్బెన్సెస్ డ్యూరింగ్ ద బ్రిటీష్ రూల్ ఇన్ ఇండియా' (1765–1857 అనే గ్రంథంలో నరసింహారెడ్డి తిరుగుబాటుకు ఒక సముచిత స్థానం కల్పించడం విశేషం. ఆ తర్వాత కాలాల్లో ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు పరిశోధన చేసి రూపొందించిన రేనాటి సూర్యచంద్రులు గ్రంథం, ప్రముఖ చరిత్రకారుడు బండి గోపాల్‌రెడ్డి రాసిన 'బ్రౌన్ జాబుల్లో స్థానిక చరిత్ర శకలాలు–కడప జాబుల సంకలనం', కల్వటాల జయరామారావు రాసిన రేనాటి వీరుడు, ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన పాణ్యం నరసరామయ్య రాసిన స్వాతంత్ర్య వీరుడు అనే పద్య కావ్యం వంటివి లేకపోతే నరసింహారెడ్డి తిరుగుబాటుకు సంబంధించిన వివరాలు చరిత్ర కాలగర్భంలో కలిసిపోయి ఉండేవి. మెగాస్టార్ చిరంజీవి నటించిన 'సైరా నరసింహారెడ్డి' చిత్రం రాకపోయి ఉంటే రాయలసీమ జిల్లాల్లో కూడా నేటి తరానికి ఆయన పేరు తెలిసేది కాదు.

తొలి స్వాతంత్ర్య యోధుడు

ఆయన స్వాతంత్ర్య సమరయోధుడు కాదని కొందరు వితండవాదన చేయడం ఆశ్చర్యం కలిగిస్తుంది. తమ సంస్థానాన్ని లాక్కున్న బ్రిటీషర్లకు వ్యతిరేకంగా సమరం చేసిన ఝాన్సీలక్ష్మీభాయి స్వాతంత్ర్య సమరయోధురాలైనపుడు, సిపాయిల పితూరి ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామమైనపుడు అంతకు పదేళ్ల ముందే గొప్ప తిరుగుబాటు చేసి ఉరికొయ్యను ముద్దాడిన ఉయ్యాలవాడ ఎందుకు స్వాతంత్ర్య సమరయోధుడు కాకుండా పోయారని ఈ ప్రాంత వాసులు ప్రశ్నిస్తున్నారు. ప్రతి తిరుగుబాటు వెనుక ఆర్థిక, రాజకీయ కారణాలు ఉంటాయి. భారతీయుల ఉమ్మడి శత్రువైన బ్రిటీషర్లకు వ్యతిరేకంగా ఎవరు పోరాడినా దాన్ని స్వాతంత్రోద్యమ ప్రవంతిలో విడదీయరాని భాగంగానే చూడాలి.

'సీమ' రైతాంగ తిరుగుబాటు

నరసింహారెడ్డి పెన్షన్ కోసం చేసిన తిరుగుబాటు అని కొందరు అర్థరహితమైన వాదనలు చేస్తున్నారు. ఆయన పెన్షన్ కోసమే అయితే తొమ్మిది వేల మంది ప్రజలు ప్రాణాలు తెగించి తిరుగుబాటులో ఎందుకు పాల్గొన్నారనే ప్రశ్నకు మాత్రం సమాధానం ఉండదు. భూమి శిస్తు చెల్లించలేని రైతులు, ఇనాములు కోల్పొయిన కట్టుబడులు, ఇంకా అనేక కారణాల వల్ల దాదాపు అన్ని వర్గాల ప్రజలు ఈ తిరుగుబాటులో పాల్గొన్నట్లు నాటి ప్రభుత్వం నియమించిన స్పెషల్ కమిషనర్ డబ్ల్యుఏడీ ఇంగ్లీస్ 1847 జనవరి 19న జ్యుడిషియల్ డిపార్టుమెంటు సెక్రటరీకి సమర్పించిన నివేదికలో స్పష్టం చేయడం గమనార్హం. ఇది రాయలసీమ రైతులు జరిపిన తొలి తిరుగుబాటుగా చూడాలి.

ప్రభుత్వాల వివక్ష

ఎంతోమంది మహానుభావుల జయంతులను రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలుగా నిర్వహిస్తున్నప్పటికీ నరసింహారెడ్డి జయంతి ఇంతవరకు నిర్వహించకపోవడం ప్రభుత్వాలు అనుసరిస్తున్న వివక్షను ఎత్తిచూపుతోంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉయ్యాలవాడ ప్రధాన అనుచరుల్లో ఒకరైన వడ్డే ఓబన్న జయంతిని జనవరి 11న రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహించడం ఆహ్వానించదగింది. అయితే ఆ తిరుగుబాటుకు నాయకత్వం వహించిన ఉయ్యాలవాడను మాత్రం విస్మరించడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉయ్యాలవాడ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని, పాఠ్యాంశాల్లో ఆయన చరిత్రను చేర్చాలని, ప్రభుత్వ పథకాలకు ఆయన పేరు పెట్టాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి.


నేడు వర్ధంతి సభ

రేనాటి సూర్యచంద్రుల విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు కడప ప్రెస్‌క్లబ్‌లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సభ నిర్వహిస్తున్నారు. కడప మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్.హరీంద్రనాథ్ అధ్యక్షతన జరగనున్న ఈ సభలో ఎమ్మెల్యేలు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, నంద్యాలకు చెందిన ప్రముఖ జర్నలిస్టు కాశీపురం ప్రభాకర్‌రెడ్డి, ఉయ్యాలవాడ వంశీయులైన రూపనగుడి గ్రామానికి చెందిన కర్నాటి ప్రభాకర్ రెడ్డి, ఇతర పార్టీలు, సంఘాల నాయకులు పాల్గొననున్నారు.

సాయం చేయబోయి మృత్యు ఒడిలోకి

ఖాజీపేట : రోడ్డుకు అడ్డుగా ఉన్న కారును తొలగించి అందులోని వారికి సాయం చేయబోయి నరహరి నాయుడు (36) మృత్యువాత పడ్డాడు. వివరాలిలా.. దువ్వూరు మండలం రామాపురం గ్రామానికి చెందిన లగుడపాటి నరహరి నాయుడు ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్‌లో తాత్కలికంగా ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఖాళీ సమయంలో ఆటో నడుపుతుండేవాడు. ఆటోలో రాజంపేటకు బాడుగకు వెళ్లి తిరిగి వస్తున్న సందర్భంలో ఖాజీపేట మండలం కుమ్మరకొట్టాలు జాతీయ రహదారి వద్ద శుక్రవారం ఇన్నోవా వాహనం టైర్ పగిలి రోడ్డుకు అడ్డుగా పడింది. అందులో ఉన్న వ్యక్తులు అటుగా వస్తున్న ఆటోలోని నరహరి నాయుడు సహాయం కోరారు. వారి విజ్ఞప్తి మేరకు కారును రోడ్డుకు అడ్డుగా లేకుండా తొలగించే ప్రయత్నం చేస్తుంగా వేగంగా లారీ వచ్చి ఢీకొంది. దీంతో అక్కడికక్కడే నరహరి నాయుడు మృతి చెందాడు. మిగిలిన ముగ్గురికి స్వల్పగాయాలు అయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఖాజీపేట సీఐ మోహన్ తెలిపారు.

పోస్టుమాస్టర్ అరెస్టు


అరెస్టు చేసిన తిరుపాల్‌నాయక్‌తో ఎస్ఐ, సిబ్బంది

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురంలోని బ్రాంచ్ పోస్టుమాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న తిరుపాల్‌నాయక్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. వివరాలిలా.. పోస్టుమాస్టర్ గత 14 సంవత్సరాలుగా నరసాపురంలో పోస్టుమాస్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ పోస్టుఫీసు పరిధిలో 7 గ్రామాల ప్రజలతో పరిచయాలు బాగా పెంచుకుని పోస్టుఫీసులో ఖాతాదారులుగా చేర్చారు. ఖాతాదారులు తమ డబ్బును పోస్టాఫీసులో జమ చేసుకుంటూ వస్తున్నారు. అయితే పోస్టుమాస్టర్ ఖాతాదారుల నగదును పోస్టాఫీసులో జమ చేయకుండా సొంత ఖర్చులకు వాడుకుంటూ ఉండేవాడు. నరసాపురం గ్రామానికి చెందిన విజయలక్ష్మి 2024 సెప్టెంబర్‌లో తన ఖాతాలోని డబ్బులు వాడుకున్నారని పోలీసుస్టేషన్‌లో పోస్టుమాస్టర్‌పై ఫిర్యాదు చేసింది. సుకన్య సమృద్ధి యోజక కింద రూ.2.90 లక్షల నగదు ఆమెకు రావాల్సి ఉంది. ఫోర్జరీ సంతకాలతో ఆ నగదును వాడుకున్నాడు. అప్పటి నుంచి పోస్టాఫీసుకు రావడం లేదు. దీనిపై జిల్లా పోస్టల్ అధికారులు విచారణ చేపట్టారు. తిరుపాల్‌నాయక్ సుమారుగా రూ.22.67 లక్షలు ఖాతాదారుల నగదును వాడుకున్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. అప్పటి నుంచి అతడి కోసం పోలీసులు గాలిస్తుండగా శుక్రవారం ఓబులాపురం వద్ద తిరుపాల్‌నాయక్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

దాల్మియా నిర్వాకంతో రైతులకు తీవ్ర నష్టం

ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు/మైలవరం : నియోజకవర్గ పరిధిలోని మైలవరం మండలంలో ఏర్పాటైన దాల్మియా సిమెంట్ కర్మాగారం నిర్వాకంతో పరిసర గ్రామాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన దాల్మియా సిమెంట్ కర్మాగారం కారణంగా నష్టపోతున్న నవాబుపేట, చిన్న కొమెర్ల, దుగ్గనపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులు తమ బాధలను ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డికి వివరించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం భూములిచ్చి సహకరించిన రైతుల పట్ల దాల్మియా యాజమాన్యం అన్యాయంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. దాల్మియా యాజమాన్యం వంకలు,వాగులు ఆక్రమించి ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టడం వల్ల వర్షాకాలంలో వరదలు వచ్చిన ప్రతి సారి పంట పొలాలు నీట మునుగుతున్నాయని అన్నారు. దీనిపై నవాబుపేట, దుగ్గనపల్లి ఎస్సీకాలనీ ప్రజలతోపాటు చిన కొమెర్ల గ్రామానికి సంబంధించిన రైతులు అనేక సార్లు ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తిగా వంకలను పూర్తిగా ఆక్రమించి కట్టడం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని యాజమాన్యానికి వివరించినా ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. దీంతో మూడు గ్రామాలకు చెందిన రైతులు లోకాయుక్తను ఆశ్రయించారన్నారు. గతంలో అధికారులు దాల్మియా యాజమాన్యం ప్రలోభాలకు లొంగి తప్పుడు రిపోర్టు ఇచ్చారన్నారు. ఇటీవల లోకాయుక్త కమిటీ ఈ ప్రాంతాన్ని పర్యటించి నివేదిక ఇచ్చింది. పంటపొలాలతో పాటు బ్లాస్టింగ్ వద్ద దెబ్బతిన్న నవాబుపేట గ్రామ ప్రజల ఇండ్లకు పరిష్కారం, దుగ్గనపల్లి గ్రామంలోని రైతుల పంట పొలాలకు పరిహారం ఇవ్వడంతోపాటు వారి గ్రామాన్ని వేరే చోటుకు తరలించి శాశ్వత పరిష్కారం చూపాలని లోకాయుక్త యాజమాన్యానికి సూచించింది. అయితే యాజమాన్యం ఇవేమి పట్టించుకోకుండా ఫ్యాక్టరీ విస్తరణ కోసం ప్రజాభిప్రాయ సేకరణకు పోవడం ఏమిటని ప్రశ్నించారు. తాము ఫ్యాక్టరీ నిర్మాణం కోసం వ్యతిరేకం కాదు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుమ్ము, ధూళి వల్ల కేవలం 200 మీటర్లదూరంలో ఉన్న దుగ్గనపల్లి గ్రామస్తులు తీవ్ర అనారోగ్యాలకు గురవుతారన్నారు. వాటికి పరిష్కారం చూపకుండా రెండో ప్లాంట్ విస్తరణకు వెళితే రైతుల కోపాన్ని యాజమాన్యం చూడాల్సి వస్తుందని హెచ్చరించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

దాల్మియా విస్తరణకు సహకరించం :

తమ సమస్యలకు పరిష్కారం చూపని దాల్మియా విస్తరణ కోసం చేపట్టే ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటామని మూడు గ్రామాలకు చెందిన రైతులు చెబుతున్నారు. ఈనెల 27వతేదిన జరిగే దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీ విస్తరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని యాజమాన్యం భావిస్తోంది. అయితే రెండో ప్లాంట్ నిర్మాణానికి ఎటువంటి పరిస్థితుల్లో తాము సహకరించబోమని మైలవరం మండలం నవాబుపేట, దుగ్గనపల్లి, కొమెర్ల గ్రామాలకు చెందిన రైతులు తెగేసి చెబుతున్నారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి కొమెర్ల మోహన్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ శివ గుర్విరెడ్డి,నవాబుపేట భాస్కర్‌రెడ్డి ,మండల కన్వీనర్ మహేశ్వరరెడ్డి కొమెర్ల సర్పంచ్ జగదీశ్వరరెడ్డితదితరులు పాల్గొన్నారు.

చెరువు మట్టిని తరలిస్తే తీవ్రంగా నష్టపోతాం

మరోసారి టిప్పర్లను అడ్డుకున్న బాధిత రైతులు

వేముల : చెరువులో మట్టిని తరలిస్తే తీవ్రంగా నష్టపోతామని బాధిత రైతులు శుక్రవారం టిప్పర్లను అడ్డుకుని నిరసనకు దిగారు. గత నెల రోజులుగా వేములకు సమీపంలో ఉన్న చెరువులో మట్టిని రోడ్డు పనులకు తరలిస్తున్నారు. చెరువులో మట్టిని తరలించడంతో మరము బయట పడింది. దీంతో చెరువు కింద భాగంలో ఉన్న బాధిత రైతులు శుక్రవారం చెరువు వద్దకు చేరుకుని మట్టిని తరలిస్తున్న టిప్పర్లను అడ్డుకున్నారు. నెల రోజులుగా రోడ్డ పనులకు చెరువు మట్టిని తోలడంతో మరము బయట పడిందన్నారు. చెరువుకు నీరు చేరితే మరములో నీరు ఇంకి కింద భాగంలో ఉన్న పొలాలపై నీరు ఊటలెత్తుతుందని, మట్టిని తరలించొద్దని ప్రొక్లెయిన్లను, టిప్పర్లను అడ్డుకుని ఆందోళనకు దిగారు. ఇప్పటికే చెరువులో నీరు ఉంటే కింద భాగంలో నీరు ఊటలెత్తి పొలాలపై పారడంతో పంటలు పండక నష్టపోతున్నామని వాపోతున్నారు. చెరువులో మట్టిని తోలుకునేందుకు అనుమతులు ఉంటే చూపించాలని బాధిత రైతులు పట్టుబట్టారు. దీంతో పోలీసులు చెరువు వద్దకు చేరుకుని బాధిత రైతులను, రోడ్డు నిర్వాహకులను స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. ఈ సందర్భంగా బాధిత రైతులు చెరువులో మట్టి తోలితే ఎదురయ్యే నష్టాలను, ఇబ్బందులను సీఐ ఉలసయ్య, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌లకు వివరించారు. ఇప్పటికే చెరువు కింద ఊటలెత్తి పంటలు పండటం లేదని, మట్టిని తోలితే పూర్తిగా భూములను వదులుకోవాల్సి వస్తుందని విజ్ఞప్తి చేశారు. దీంతో చెరువులో మట్టిని తోలుకునేందుకు అనుమతులు చూపించాలని రోడ్డు నిర్వాహకులకు సూచించారు. అలాగే ఇరిగేషన్ అధికారులతో పోలీసులు చెరువులో మట్టిని తోలుకునేందుకు ఏవైనా అనుమతులు ఇచ్చారనే విషయంపై మాట్లాడారు. దీనికి ఇరిగేషన్ అధికారులు మట్టిని తోలుకునేందుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని పోలీసులకు వివరించారు. దీంతో పోలీసులు చెరువులో మట్టిని అనుమతులు తీసుకున్న తర్వాతనే తోలుకోవాలని, అంతవరకు నిలిపివేయాలని రోడ్డు నిర్వాహకులకు సూచించారు.


చెరువు వద్ద మట్టిని తోలకుండా రైతులు అడ్డుకోవడంతో నిలిచిన టిప్పర్లు

'చదువుకు పేదరికం అడ్డుకాదు'

చాపాడు : చదువుకు వృత్తి, పేదరికం అడ్డుకాదని.. పుట్టింది సాధారణ పేదింటి కుటుంబమైనా రైతు బిడ్డగా కష్టపడి చదివి డాక్టర్ పట్టా సాధించి తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులను ఆనందపరిచాడు మండలంలోని కేతవరం గ్రామానికి చెందిన విద్యార్థి పోలు అంకిరెడ్డి. కేతవరం గ్రామానికి చెందిన పోలు ఆశోక్‌రెడ్డి, విజయలక్ష్మీ దంపతుల కుమారుడు పోలు అంకిరెడ్డి కర్నూలులోని విశ్వభారతి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసి డాక్టర్ పట్టా అందుకున్నాడు. రైతు కుటుంబానికి చెందిన అంకిరెడ్డి తల్లిదండ్రులు గత కొన్నేళ్లుగా ప్రొద్దుటూరు – మైదుకూరు జాతీయ రహదారిలోని అల్లాడుపల్లె క్రాస్ సమీపంలో టీ షాప్ నిర్వహిస్తున్నారు. ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న అంకిరెడ్డి ఎంఎస్ జనరల్ పూర్తి చేసి పేద ప్రజలకు వైద్యం అందించడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా తెలిపాడు.


ఎంబీబీఎస్ పట్టా అందుకుంటున్న అంకిరెడ్డి

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు

బద్వేలు అర్బన్ : అగ్రిగోల్డ్ కంపెనీ ఆర్థిక మోసాలకు బలైన కస్టమర్లకు, ఏజెంట్లకు న్యాయం జరిగేలా చూడాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ సుధకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు బాబురావు, వెంకటసుబ్బయ్యలు మాట్లాడుతూ సమర్థ అధికారుల బృందంతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి బాధితుల సమస్యల పరిష్కారానికి కాలపరిమితితో కూడిన కార్యాచరణను అప్పగించడంతో పాటు అగ్రిగోల్డ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జాన్, బాబు, పార్థసారధి, శ్రీనివాసులు, సుబ్బరాయుడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై ప్రశ్నిస్తే కేసులు పెడతారా

- ప్రభుత్వం మెడలు వంచేందుకు అన్ని పార్టీలు కలిసి రావాలి
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : మిర్చి రైతుల సమస్యలపై ప్రశ్నించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై కేసులు పెట్టడం అన్యాయమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి ధ్వజమెత్తారు. జగన్‌తోపాటు మిర్చి యార్డుకు వెళ్లిన పలువురు మాజీ ఎమ్మెల్యేలు, సంఘటన స్థలంలోలేని మాజీ మంత్రి పేర్ని నానిపై కూడా కేసు పెట్టడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఆయన శుక్రవారం తన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వినాశకాలే విపరీత బుద్ధి అన్న చందంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. సూపర్ 6 అమలు చేయలేదని, మెగా డీఎస్సీ అమలు కాలేదని, రైతులకు మద్దతు ధర లభించడం లేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయని ప్రభుత్వం సిగ్గుపడాల్సిందిపోయి ప్రతిపక్ష పార్టీ నేతలపై కేసులు పెట్టడం తగునా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ప్రభుత్వం మాత్రం అన్ని గాలికొదిలేసిందని విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేంద్రం ప్రకటించని 24 పంటలకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందని, తద్వారా రూ.65వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడం, ఇంటి గ్రేటెడ్ ల్యాబ్‌ల ఏర్పాటు ద్వారా పరీక్షలు చేయడం, ఉచిత పంటల బీమా, పంట రుణాలపై సున్నా వడ్డీ, ఈ క్రాప్ విధానం, రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం కింద ఏటా రూ.13,500 ఇచ్చేవారన్నారు. ఇలా వ్యవసాయ రంగానికి సంబంధించి అనేక సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత జగన్‌దేనన్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం వీటన్నింటిని గాలికి వదిలేసిందన్నారు. చంద్రబాబు రైతులకు పెట్టుడి సాయం కింద రూ.20వేలు ఇస్తానని చెప్పి ఇంత వరకు 20 పైసలు కూడా ఇవ్వలేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో క్వింటాలు మిర్చి ధర రూ.24వేలు ఉండగా, ప్రస్తుతం రూ.10వేలకు పడిపోయిందన్నారు. ప్రతి ఎకరానికి మిర్చి రైతు రూ.లక్ష నష్టపోయారని తెలిపారు. ఈ కారణంగానే జగన్ గుంటూరు మిర్చి యార్డును సందర్శించి రైతులతో మాట్లాడారని చెప్పారు.

మా నాయకుడు కేసులకు భయపడడు

తమ అధినాయకుడు జగన్ కేసులకు భయపడుతాడు అనుకోవడం టీడీపీ నాయకుల అవివేకమని రాచమల్లు అన్నారు. ప్రభుత్వం మెడలు వంచేందుకు రాష్ట్రంలోని అన్ని పార్టీలు కలసి రావాలని రాచమల్లు శివప్రసాదరెడ్డి కోరారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ జేష్టాది శారద, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, కౌన్సిలర్లు గుర్రం లావణ్య, పాతకోట మునివంశీధర్‌రెడ్డి, నూకా నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గుద్దేటి రాజారాంరెడ్డి, నియోజకవర్గ ప్రచార కమిటీ కన్వీనర్ దేసు రామ్మోహన్ రెడ్డి, చేనేత విభాగం కన్వీనర్ చౌడం రవిచంద్ర పాల్గొన్నారు.

సోషల్ మీడియా అకౌంట్‌లపై కేసు నమోదు

కడప అర్బన్ : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై అసభ్యకరంగా పోస్టులు పెడుతున్న పలు సోషల్ మీడియా అకౌంట్‌లపై జనసేన పార్టీ ఎన్నికల ప్రోగ్రాం కమిటీ రాయలసీమ కో–కన్వీనర్ పంద్రా రంజిత్‌కుమార్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఫోటోలను మార్ఫింగ్ చేసి ఆయన కుటుంబసభ్యులను అవమానపరిచేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు సమాజంలో విద్వేషాలు కలిగించేలా రాజకీయపార్టీల మధ్య ఘర్షణకు దారి తీసి శాంతికి భంగం కలిగించేలా వున్నాయనీ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే వైఎస్సార్ జిల్లా కడప తాలూకా ఎస్ఐ తాహీర్ హుసేన్ కేసు నమోదు చేశారు.

గ్రూప్–2లో రోస్టర్ విధానం సవరించాలి

కలెక్టరేట్ ఎదుట అభ్యర్థుల ప్రదర్శన


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రూప్-2 అభ్యర్థులు

కడప సెవెన్‌రోడ్స్ : ఈనెల 23వ తేదీన నిర్వహించే గ్రూప్–2 మెయిన్స్ పరీక్షల్లో రోస్టర్ విధానాన్ని సరిచేయాలని కోరుతూ అభ్యర్థులు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ప్రదర్శన నిర్వహించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ మాట్లాడుతూ అనేక పోరాటాల తర్వాత గ్రూప్–2లో 899 పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందని పేర్కొన్నారు. అయితే రోస్టర్ పాయింట్స్‌లో తప్పులు ఉండడం వల్ల నిరుద్యోగ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో మెయిన్స్ పరీక్షల కోసం 92,250 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. అయితే రోస్టర్‌లో తప్పుల వల్ల పరీక్షలు జరుగుతాయా? లేదా అన్న అనుమానం అభ్యర్థుల్లో గందరగోళానికి తావిస్తోందన్నారు. రోస్టర్‌పాయింట్‌లో చోటుచేసుకున్న తప్పులను సవరిస్తే తప్ప అభ్యర్థులకు న్యాయం జరగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి అభ్యర్థుల అనుమానాలు నివృత్తి చేయాలన్నారు. రోస్టర్ విధానంలో తప్పుల వల్ల గతంలో కొన్ని రాష్ట్రాల్లో నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ కోర్టులు తీర్పునిచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గ్రూప్–2 అభ్యర్థులు గుర్తు చేశారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ ఇటీవల నోటిఫికేషన్ రద్దుచేసిన విషయాన్ని వారు ప్రస్తావించారు. ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా చూడాలంటూ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వంపై బాధ్యత ఉంచిందన్నారు. కార్యక్రమంలో ఏపీపీఎస్సీ అభ్యర్థులు సుమన్, ఆర్‌సీ రెడ్డి, శ్రీనాథరెడ్డి, పూర్ణచంద్ర, చక్రి, రసూల్ బాష, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి విజయ్, సహాయ కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రాన్ని సమర్పించారు.

టీడీపీ నేతల ఒత్తిడితో ఉపాధి ఫీల్డ్‌అసిస్టెంట్ తొలగింపు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని జంగంరాజుపల్లె పంచాయతీ బాలాజీనగర్‌కు చెందిన ఉపాధి ఫీల్డ్‌అసిస్టెంట్ నాగిపోగు అపర్ణపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అమరావతి, వెంకటసుబ్బయ్య , యాదవ సామాజిక వర్గం నాయకుల తప్పడు ఆరోపణలు చేసి ఆమెను విధుల నుంచి తొలగించాలని ఒత్తిడి చేశారు. దీంతో అధికారులు బుధవారం అపర్ణను విధుల నుంచి తొలగించారు. ఈ విషయమై శుక్రవారం ఫీల్డ్ అసిస్టెంట్ భర్త సంజీవ్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పక్షాన చురుగ్గా పాల్గొన్నట్లు నాపై ఎమ్మెల్యే పుట్టాసుధాకర్‌యాదవ్‌కు చేశారన్నారు. ఎన్నికల్లో నేనుగాని, నా కుటుంబ సభ్యులు పాల్గొనలేదని అతడు పేర్కొన్నాడు. 2022 నుంచి తన భార్య పంచాయతీలో ఉపాధి ఫీల్డ్‌అసిస్టెంట్‌గా పనిచేస్తోందన్నారు.ఎక్కడా ఎలాంటి రిమార్కు లేదన్నారు. కేవలం రాజకీయ కక్షతో, నాయకుల ఒత్తిడి మేరకు అధికారులు ఆరోగ్యం సరిగాలేదని రాజీనామా చేస్తున్నట్లు రాయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. బాలాజీనగర్ టీడీపీ నాయకుడు అమరావతి వెంకటసుబ్బయ్య కోడుకు 2006 నుంచి 2010 వరుకు ఉపాధి ఫీల్డ్‌అసిస్టెంట్‌గా ఉన్నపుడు దాదాపు ర. 13లక్షలు దొంగ జాబ్ కార్డులతో పోస్టల్ ద్వారా నిధులు మళ్లించాడన్నారు. అప్పటిలో సామాజిక తనిఖీలో కూడా ఈ విషయం తేలిందన్నారు. అతనిని అధికారులు తొలగించారు. అటువంటి అవినీతి పరులు మాపై తప్పుడు ఆరోపణలు చేయగానే దళితులమైన మా కడుపు కొడతారా అని ఆవేదన వ్యక్తం చేశాడు.